# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- గడచిన 20 నెలలుగా రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ సంవత్సరం బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- ఆత్మనిర్భర్ వికసిత్ భారత్‌పై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఈరోజు ఏకగ్రీవంగా ఆమోదించింది.
- ఆహార పదార్థాల కల్తీ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.

====================

గడచిన 20 నెలలుగా రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈరోజు మాట్లాడుతూ.. సమావేశాల్లో నిర్మాణాత్మకమైన చర్చలు జరిగాయన్నారు. గడచిన 15 రోజులుగా శాసనసభలో 5 కోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయని, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే చర్చించామని చెప్పారు. ఎన్డీఏ కూటమి పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయని, పార్టీలన్నీ పూర్తి సమన్వయంతో వెళ్లడం వలన అనుకున్నది సాధించగలిగామని చెబుతూ...

(వాయిస్…29 సెకన్లు)

అలాగే.. 3.32 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఇంటింటికీ కుళాయి ఇచ్చేలా జల్ జీవన్ మిషన్ ను ప్రణాళిక చేశామని, ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం పోరాటం చేస్తున్నామని వివరించారు. 43 వేల 298 కోట్ల రూపాయల విలువైన అప్పులను రీషెడ్యూలు చేయించామని, తద్వారా 328 కోట్ల రూపాయల మేర ఆదా అవుతుందని వివరించారు. మరో లక్ష కోట్ల రూపాయల మేర అప్పులను రీషెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుంటామని దీని ద్వారా ఒకవెయ్యి 658 కోట్ల రూపాయలు ఆర్థికంగా వెసులుబాటు వస్తుందని వివరించారు. పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్ నాటికి జాతికి అంకితం చేసేలా పనులు వేగవంతం చేస్తున్నామని, గోదావరి పుష్కరాలకు ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్…24 సెకన్లు)

====================

ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు ఎప్పటికప్పుడు గళం విప్పాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఈరోజు ఆయన సమాధానమిస్తూ.. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజలు కూడా ఉద్యమిస్తే కల్తీని అరికట్టవచ్చని అన్నారు. ఆకస్మిక తనిఖీల ద్వారా ఆహార పదార్థాల నమూనాల సేకరణతో పాటు పరీక్షలు చేయడం వంటి చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల తనిఖీలు జరిపినప్పుడు ఆహార పదార్థాల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్టు తేలిందని చెప్పారు. కల్తీకి పాల్పడే వారిపై కఠిన

చర్యలు తీసుకునేందుకు వీలుగా నిబంధనల మార్పు కోసం ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ అఫ్ ఇండియా అధికారులతో కూడా చర్చించనున్నామని మంత్రి వెల్లడించారు.

====================

మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ఈ నెల 8వ తేదీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ కలెక్టరేట్‌లోని మహిళా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక క్రీడా పోటీలను కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా అధికారులు, సిబ్బంది చురుకైన పాత్ర పోషిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకంగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

====================

విరామం

====================

రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ సంవత్సరం బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. బడ్జెట్ పై అసెంబ్లీలో ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే బడ్జెట్‌లో 33 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అలాగే ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామన్నారు. గత ప్రభుత్వం 35 వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని, అందులో 25 వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని చెప్పారు. న్యాయశాఖకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని.. కొత్తగా కోర్టు భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్…18 సెకన్లు)

====================

ఆత్మ నిర్భర్ వికసిత్ భారత్‌పై సంకల్పం తీసుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిపాదించిన 'ఆత్మ నిర్భర్ వికసిత్ భారత్' సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్రాన్ని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో మరింత బలోపేతం చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. 2047 నాటికి భారత దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టి, రాష్ట్రాన్ని 308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

====================

ఢిల్లీలో ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు హాజరుకానున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత - సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై ముఖ్యమంత్రి కీలక ఉపన్యాసం చేయనున్నారు. రేపు మధ్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్ లో జరిగే ఈ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన అమరావతికి తిరిగి రానున్నారు.

====================

జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థినీ విద్యార్థులకు మంచి చెడుల వ్యవహార శైలిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలసి ఈరోజు ఆయన బాలబాలికలు, యువత భద్రతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలపై సరైన అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌమార దశలో గర్భధారణ వలన కలిగే ఇబ్బందులను, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను, ఆరోగ్య సమస్యలను వివరించాలని సూచించారు.

====================

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ప్రతిపాదిత పరిశ్రమల స్థాపన, వాటి పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనపై పరిశ్రమల శాఖ అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీటి సరఫరా, రహదారి సౌకర్యాలు మొదలైన వాటిని ముందుగానే సిద్ధం చేసి పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

=====================

అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలను సాగు చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి రైతాంగానికి పిలుపునిచ్చారు. భోగాపురం, డెంకాడ మండలాల్లో ఈరోజు ఆయన పర్యటించి, ఉద్యాన పంటలను పరిశీలించారు. సాగు చేస్తున్న పద్ధతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

=====================
=====================